RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | బుధవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 185 | జూన్ 18, 2025 | వెల : రూ.3-00



హిమాచల్ ప్రదేశ్‌లో లోయలో పడ్డ బస్సు

3లో..



## వచ్చే నెల 17న

# రైల్ రోకో

- అన్ని సంఘాల నేతలను కలుపుకొని..
- ఢిల్లీ పాలకులకు తెలంగాణ పౌరుషం చాటుతాం
- బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదానికి కేంద్రంపై ఒత్తిడి
- ప్రశ్నించకుంటే బీసీలకే తీవ్రనష్టం: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

**వేద న్యూస్, మెదక్ :**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు ఆమోదం కోసం జులై 17వ తేదీన రైల్ రోకో నిర్వహిస్తామని బీ ఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వెల్లడించారు. ఢిల్లీ పాలకులకు సెగ తాకేలా రైల్ రోకో ఉంటుందని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం మంగళవారం మెదక్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొని ఆమె మాట్లాడారు.

కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తేనే బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందుతుందని, 42 శాతం రిజర్వేషన్ల కోసం బీసీలు ప్రశ్నించకుంటే తీవ్రనష్టం జరుగుతుందన్నారు. విద్య, ఉద్యోగాలు, రాజకీయాలకు వేర్వేరు బీసీ రిజర్వేషన్ల బిల్లు పెట్టాలని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. బీసీ బిడ్డలు పోరాడితే వారి కాళ్ల వద్దకే పదవులు వస్తాయన్నారు. అన్ని బీసీ సంఘాల నాయకులను కలుపుకొని రైల్ రోకో చేస్తామని చెప్పారు. ఢిల్లీ పాలకులకు తెలంగాణ బీసీల పౌరుషాన్ని చాటుతామని వివరించారు.

తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ ఒత్తిడితోనూ అసెంబ్లీలో ప్రభుత్వం మూడు బీసీ బిల్లులు పెట్టిందని వెల్లడించారు. వార్డు మెంబర్, సర్పంచ్ లు కాని అనేక కులాలు బీసీల్లో ఉన్నాయని చెప్పారు. అసెంబ్లీ గడప తొక్కని అనేక కులాలు ఉన్నాయనీ, రాజకీయ అవకాశాల్లో బీసీ మహిళల పరిస్థితి మరింత దారుణంగా ఉందని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్లలో బీసీలకు ఉప కోటా ఉండాలని చెప్పారు. ఇది రాజకీయ వేదిక కాదు... ఇది మానవ హక్కులు, సామాజిక హక్కులు వేదిక అని స్పష్టం చేశారు. సమాజంలో 56 శాతం జనాభాకు సంబంధించి హక్కులు కోరుతుంటే అవి మానవ హక్కులు కావా ? ఇప్పుడు మాట్లాడాల్సిన సందర్భం వచ్చింది... కాబట్టి అందరూ కలిసికట్టుగా హక్కుల కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. బీసీ బిల్లులను కేంద్రం ఆమోదించేలా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని, ఢిల్లీకి బిల్లు పంపించి కాంగ్రెస్ ప్రభుత్వం చేతులుదులుపుకుంది అని ఆరోపించారు.

మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు బీసీ బిల్లు గురించి ఒక్క రోజు కూడా మాట్లాడలేదని విమర్శించారు. రఘునందన్ రావు బీసీల కోసం ఎందుకు మాట్లాడడం లేదు ? అని నిలదీశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీ బిల్లును ఎందుకు ఆమోదించడం లేదని ప్రతీ ఒక్కరు రఘునందన్ రావును ప్రశ్నించాలని సూచించారు. కులగణన వివరాలను కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీల వారీగా ప్రకటించాలని కోరారు. రౌండ్ టేబుల్ సమావేశానికి రానివ్వకుండా బీసీ నాయకులను మెదక్‌లో కొంత మంది బెదిరించే ప్రయత్నం చేశారనీ ఆరోపించారు. దీన్నీ బట్టే వాళ్లు భయపడుతున్నారని అర్థమవుతోందని స్పష్టమవుతోందన్నారు.

## కేంద్రంపై విమర్శలు మానుకోవాలి..!

- తూర్పు అభివృద్ధిపై మంత్రి కొండా సురేఖ దృష్టిపెట్టాలి
- మంత్రి వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించిన గంట రవికుమార్



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**

రాష్ట్రాల అభివృద్ధికి కేంద్రంలోని మోదీ సర్కారు కట్టుబడి ఉందని, ఇందులో భాగంగానే రాష్ట్రానికి, ఉమ్మడి వరంగల్ జిల్లాకు నిధులు ఇచ్చినా రాజకీయ లబ్ధికోసం అసత్యాలు ప్రచారం చేయడం మానుకోవాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంట రవికుమార్ హితవు పలికారు. సోమవారం మంత్రి సురేఖ మీడియాతో మాట్లాడుతూ కేంద్రంపై చేసిన వ్యాఖ్యలపై మంగళవారం గంట రవికుమార్ స్పందించారు. గోదావరి పుష్కరాల కోసం ఆంధ్రాకు నిధులిచ్చిన కేంద్రం, తెలంగాణకు మాత్రం నిధులివ్వక పక్షపాతం చూపుతోందని చేసిన ఆరోపణలో వాస్తవం లేదన్నారు. కేంద్రం ఎస్ఏఎస్‌సీఐ(స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్) స్కీం కింద రాష్ట్రాలకు 50ఏళ్ల వరకు వడ్డీలేని రుణాలు అందిస్తోందని గంట రవికుమార్ స్పష్టం చేశారు. ఈ నిధులను వాడుకునే అవకాశం రాష్ట్రానికి కూడా ఉందన్న విషయం మంత్రి గుర్తించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎస్ఏఎస్‌సీఐ, ఓఎఫ్‌సీ(ఆప్టికల్ ఫైబర్ కేబుల్) నెట్‌వర్క్ కింద నిధులు తీసుకుని పర్యాటక అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, అనుసంధానం, లాజిస్టిక్స్ తదితర పనులకు వినియోగించుకోవచ్చన్న విషయం మంత్రికి తెలియదా అంటూ ఎద్దేవా చేశారు. ఈ స్కీం కిందే ఆంధ్ర రాష్ట్రం రూ.93కోట్లు నిధులు తెచ్చుకుని గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించినట్లు గంట రవికుమార్ స్పష్టం చేశారు. ఇవేవీ తెలియక కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై సురేఖ విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికైనా నిజానిజాలు తెలుసుకుని హుందాగా మాట్లాడాలని హితవు పలికారు.

### రామప్పకు రూ.73.74 కోట్లు ఇచ్చిన కేంద్రం..

టూరిజం సస్టైనబుల్ సర్క్యూట్ స్కీం పేరుతో ఎస్ఏఎస్‌సీఐ నుంచే రాష్ట్ర ప్రభుత్వం రూ.73.74కోట్లు తీసుకుని రామప్పను అభివృద్ధి చేస్తోందని, ఈ విషయాన్ని మంత్రి గుర్తించుకోవాలని గంట రవికుమార్ పేర్కొన్నారు. అంతేకాదు సోమసిల్లలో వెల్నెస్, స్పిరిచువల్ రిట్రీట్ నల్లమల పేరుతో మరో రూ.68.10 కోట్లు ఖర్చుపెట్టిన విషయం దేవాదాయశాఖ మంత్రి సురేఖకు తెలియదా అంటూ ఎద్దేవ చేశారు. ఓరుగల్లుకు స్మార్ట్ సిటీ, అమృత్, హృదయ్ పథకాలను అమలు చేస్తున్న విషయం మరవడం విడ్డూరంగా ఉందన్నారు. అలాగే, కేఎంసీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, కాజీపేట ఓరాలింగ్ వ్యాగన్ ఫ్యాక్టరీ, రామప్పకు యూనెస్కో, గిరిజన యూనివర్సిటీ ఇలా చెప్పుకుంటూ పోతే కేంద్రం ఇచ్చింది ఎంతో ఉందన్నారు.

### రాజకీయ పబ్బం కోసమే మంత్రి వ్యాఖ్యలు..

కాంగ్రెస్ పార్టీలో తన గ్రాఫ్ రోజురోజుకూ పడిపోతుండడంతో తన రాజకీయ పబ్బం కోసమే మంత్రి సురేఖ కేంద్రంపై అసత్య ప్రచారాలు చేసి లబ్ధిపొందాలని చూస్తోందని రవికుమార్ విమర్శించారు. అయినా ఆమె మాటలు ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. నమ్మి ఓటేసిన వరంగల్ తూర్పు నియోజకవర్గానికి ఆమె చేసిన అభివృద్ధి శూన్యమని ఆరోపించారు. ఇప్పటికైనా తూర్పు అభివృద్ధిపై దృష్టిసారించాలని గంట సూచించారు. లేదంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

# పెండింగ్ కేసులను పూర్తి చేయాలి

- ఫోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ చేయాలి
- సైబర్ నేరాల పై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి
- ఎస్పీ శరత్ చంద్ర పవర్




**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

జిల్లా కేంద్రంలో మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారులతో ఎస్పీ నెలవారి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్ కేసులు లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్ కేసులను త్వరితంగా పరిష్కరిస్తూ పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడానికి ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి అడిగి, గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ తో పూర్తి పారదర్శకంగా చేయాలన్నారు. కేసు నమోదు నుండి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్నికూలంకుషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలన్నారు. ఫోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. ప్రతి అధికారికి సి.సి.టి.యన్.ఎస్ పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఇన్వెస్టిగేషన్, స్టేషన్ మేనేజ్మెంట్ తెలిసి ఉండాలని సూచించారు. అవసరమైతే సంబంధిత న్యాయమూర్తులను స్వయంగా కలిసి కేసుల పరిష్కారానికి మరింత చొరవ చూపాలని సూచించారు. దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్ కేసుల విషయంలో నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, కొత్త కేసులతో పాటు చాలా కాలంగా పెండింగ్ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షించడం ద్వారా కేసుల సంఖ్య తగ్గించే దిశగా అన్ని స్థాయిల అధికారులు పని చేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సంవర్దవంతమైన సేవలు అందజేస్తు సత్వర న్యాయం చేసేలా కృషి చేయాలని అన్నారు. గ్రామ పోలీసు అధికారులు ప్రతీ రోజు గ్రామానికి సందర్శించి ప్రజలతో మమేకం అవుతూ నేర నియంత్రణకు కృషి చేయాలని తెలిపారు. కమ్యూనిటీ పోలిసింగ్ ద్వారా గ్రామాలలో సిసిటీవి లు ప్రాముఖ్యత అవగాహన కల్పిస్తూ ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు. సైబర్ క్రైమ్, డయల్ 100 వాటి వినియోగంపై విద్యార్థులు, ప్రజల కు అవగాహన

మిగతా 4వ పేజీలో..

## గో సంరక్షణకు సమగ్ర విధానం

**వేద న్యూస్, హైదరాబాద్ :**



రాష్ట్రంలో గోవుల సంరక్షణకు సమగ్ర విధానం రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం వివిధ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధానాల అధ్యయనానికి ముగ్గురు అధికారులతో ఒక కమిటీని నియమించారు. పశు సంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావుతో కూడిన కమిటీ ఈ విషయంలో లోతైన అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో గో సంరక్షణపై ముఖ్యమంత్రి తన నివాసంలో మంత్రి వాకిటి శ్రీహరితో పాటు ఉన్నతాధికారుల సమావేశంలో సమీక్షించారు. మన

మిగతా 4వ పేజీలో..



# శానిటేషన్ నిర్వహణలో అలసత్వం వద్దు

- కమిషనర్ చాహత్ బాజ్ పాయ్

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

శానిటేషన్ నిర్వహణలో అలసత్వాన్ని వీడాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. మంగళవారం వరంగల్ నగర పరిధిలోని 25, 26 డివిజన్‌లలో చార్ బౌలి ప్రాంతంలో కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించి సానిటేషన్ నిర్వహణను పరిశీలించారు. సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్‌ను కమిషనర్ తనఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జవాన్‌లు సిబ్బంది మాన్యువల్‌గా సంతకాలు చేయడంతో పాటు బయోమెట్రిక్ హాజరు కూడా ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం విధులకు హాజరై, వెళ్లేటప్పుడు నమోదు చేయాలని, అటెండెన్స్ నమోదులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని బయోమెట్రిక్ అటెండెన్స్ ఆధారంగానే వేతనాల చెల్లింపు జరుగుతుందని అన్నారు. వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఎల్లమ్మ గుడి వద్ద గల చౌరస్తా నుండి చార్ బౌలి వాటర్ ట్యాంక్ వరకు నిర్వహించిన ర్యాలీలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో కలియతిరిగిన కమిషనర్ స్థానికులతో మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా రక్షిత చర్యలు తీసుకోవాలని, కార్పొరేషన్ సిబ్బందికి సహకరించాలని, తడి పొడి చెత్తను వేరుగా అందజేయాలని అవగాహన కల్పించి ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని అందజేసి ఇందు కు సంబంధించిన స్టిక్కర్‌ను గృహాలకు అతికించి నిర్వహించిన స్వచ్ఛ ప్రతిజ్ఞలో

మిగతా 4వ పేజీలో..

# ఇండియాకు ఐదు దేశాల మద్దతు..

వేద న్యూస్,అంబేద్కర్ కోనసీమ (అమలాపురం):




దేశంలో ఆపరేషన్ సిందూర్‌ని ప్రారంభించి టెర్రరిజం అణచివేతకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ బాలయోగి తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ నేతృత్వంలో గయానా, పనామా, కొలంబియా, బ్రెజిల్, యునైటెడ్ దేశాలను సందర్శించారు. ఈ బృందంలో ఎంపీ హరీష్ బాలయోగి కూడా ఉన్నారు. ఢిల్లీకి తిరిగి వచ్చిన తర్వాత మీడియాతో ఆయన మాట్లాడారు. ఐదు దేశాలతో దౌత్యపరమైన చర్చలు జరిపినట్లు వెల్లడించారు. టెర్రరిజానికి వ్యతిరేకంగా పోరాడేందుకు ఐదు దేశాలు ఇండియాకు మద్దతిచ్చాయని అన్నారు. ఈ సందర్భంగా ఆ దేశాల ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు ఎంపీ గంటి హరీష్ మాధుర్ మే 24వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు వివిధ దేశాల్లో తాము పర్యటించామని ఎంపీ గంటి హరీష్ మాధుర్ వెల్లడించారు. యునైటెడ్ నేషన్స్ పర్యటన అనంతరం ఇండియాకు చేరుకున్నామని తెలిపారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడదామని ఆయా దేశాలకు తాము వివరించామని అన్నారు. పాకిస్థాన్ మిలటరీ బేస్ క్యాంప్‌నకు ఇబ్బంది లేకుండా టెర్రరిస్టులను మాత్రమే లక్ష్యంగా చేసుకుని భారత బలగాలు దాడులు చేశాయని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల నేతలతో కలిసి ఈ పర్యటన చేశామని చెప్పారు. న్యూయార్క్ 9/11 టెర్రరిస్ట్ దాడులను జ్ఞాపకం చేసుకుని, టెర్రరిజాన్ని అంతం చేయాలనే విషయాన్ని ఆయా దేశాల ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేశామని అన్నారు. తాము పర్యటించిన ప్రతి దేశంలో భారతదేశానికి మద్దతు లభించిందని గుర్తుచేశారు ఎంపీ గంటి హరీష్ మాధుర్ టెర్రరిజానికి వ్యతిరేకంగా పోరాడేందుకు ఐదు దేశాల ప్రతినిధులకు భారతదేశం అండగా ఉంటుందని చెప్పామని ఎంపీ గంటి హరీష్ మాధుర్ అన్నారు. యుద్ధం పరిష్కారం కాదు కానీ టెర్రరిజం అంతం చేసే ప్రణాళికలకు అందరూ సహకరిస్తున్నారని అన్నారు. భార్య బిడ్డల ముందు పహల్గామ్‌లో భారత పర్యాటకులను పాకిస్థాన్ ఉగ్రవాదులు చంపడం నీచమైన చర్య అని... దీనినే ప్రపంచ దేశాలకు తెలియజేశామని చెప్పారు. ఇండియాతో కలసి రావటానికి ప్రపంచ దేశాలు మొగ్గు చూపాయని పేర్కొన్నారు ఎంపీ గంటి హరీష్ మాధుర్ పాకిస్థాన్ చేస్తున్న తప్పుడు ఆరోపణలను సమర్థవంతంగా తిప్పికొట్టామని ఎంపీ గంటి హరీష్ మాధుర్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో సామాన్యులకు, పౌరులకు ఎలాంటి హాని జరగలేదని గుర్తుచేశారు. పక్క ప్రణాళికతో ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేశామని పేర్కొన్నారు. ఈ అవకాశం తనకు కల్పించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఎంపీ గంటి హరీష్ మాధుర్ బాలయోగి కృత్జ్ఞతలు తెలిపారు.

# ముక్తేశ్వరం ఆలయంలో పట్టపగలు దోపిడీ

- పవన్‌ను టార్గెట్ చేసిన యాంకర్ శ్యామల - సనాతని పవన్ పట్టించుకోరా అంటూ వ్యాఖ్యలు

వేద న్యూస్, డెస్క్:



అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ఓ ప్రసిద్ధ ఆలయంలో పట్టపగలే దొంగలు చొరబడి లక్షల విలువైన ఆభరణాలను అపహరించుకుపోయిన ఘటన ఇప్పుడు రాజకీయ రంగు పులుముకుంది. ఈ ఉదంతంపై వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యాంకర్ శ్యామల... ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. "మీరు ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలోని గుడిలో పట్టపగలు బంగారం దోపిడీ జరిగినా పట్టించుకోలేనంత బిజీగా ఉన్నారా 'ది సో కాల్డ్ సనాతని' పవన్ కల్యాణ్ ?" అంటూ వ్యంగ్యంగా ప్రశ్నించారు. ఈ మేరకు దోపిడీ వార్త క్లిప్పింగ్ ను కూడా శ్యామల సోషల్ మీడియాలో పంచుకున్నారు.వివరాల్లోకి వెళితే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం ముక్తేశ్వరంలో కొలువైన శ్రీముక్తికాంత క్షణముక్తేశ్వరాలయంలో శుక్రవారం (జూన్ 13) మధ్యాహ్నం ఈ చోరీ జరిగింది. ఆలయం మూసివేసిన సమయంలో గుర్తుతెలియని దుండగులు తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. గర్భగుడిలోని అమ్మవారి మెడలోని బంగారు, వెండి ఆభరణాలను అపహరించుకుపోయారు. వీటి విలువ సుమారు లక్షా నలభై వేల రూపాయలు ఉంటుందని ఆలయ వర్గాలు మరియు స్థానికులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. ఆలయ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. క్లూస్ టీమ్ ఇన్‌ఛార్జ్ కె. ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలోని బృందం ఘటనా స్థలానికి చేరుకుని వేలిముద్రలతో పాటు ఇతర కీలక ఆధారాలను సేకరించింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, దర్యాప్తును ముమ్మరం చేశారు. సమీపంలోని సీసీటీవీ ఫుటేజ్‌లను కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం.

## ఇజ్రాయెల్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఢిల్లీలో హెల్ప్‌లైన్ ఏర్పాటు




వేద న్యూస్, న్యూఢిల్లీ :

ఇరాన్ – ఇజ్రాయెల్ దేశాల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో, ఆ ప్రాంతాల్లో నివసిస్తున్న లేదా ప్రయాణిస్తున్న తెలంగాణ వాసులు, విద్యార్థులకు సహాయం అందించేందుకు, తెలంగాణ ప్రభుత్వం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ప్రారంభించింది. విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, రెండు దేశాల భారత రాయబార కార్యాలయాల నుంచి లభించిన తాజా సమాచారం ప్రకారం, ఇప్పటి వరకు తెలంగాణకు చెందిన ఎవరూ ప్రభావితమైనట్టు సమాచారం లేదు. అయినప్పటికీ, భవిష్యత్ పరిణామాల దృష్ట్యా ముందు జాగ్రత్తగా హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయడమైందని అధికారులు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశానుసారం.. తెలంగాణ భవన్ సీనియర్ అధికారులు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖతో, ఆయా దేశాల రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదిస్తూ అవసరమైతే తక్షణ సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నారు.

## ప్రయాణికులకు గుడ్‌న్యూస్



వేద న్యూస్, డెస్క్:

దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికులకు శుభవార్త చెప్పింది. చర్లపల్లి–నర్సాపూర్–చర్లపల్లి, జాల్నా –తిరుపతి–జాల్నా మధ్య ప్రస్తుతం నడుస్తున్న రైళ్లను వచ్చే ఏడాది మార్చి నెలాఖరు వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నది. చర్లపల్లి–నర్సాపూర్ (07233) రైలు ప్రతి శనివారం సాయంత్రం 7.50 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7 గంటలకు గమ్యస్థానం చేరుకుంటుందని పేర్కొంది. నర్సాపూర్–చర్లపల్లి (07234) రైలు ప్రతి ఆదివారం రాత్రి 8 గంటలకు బయలుదేరి ఉదయం 7 గంటలకు గమ్యస్థానం చేరుకుంటుందని పేర్కొంది. జాల్నా–తిరుపతి (07609) రైలు ప్రతి సోమవారం ఉదయం అందుబాటులో ఉంటుందని.. జాల్నా స్టేషన్‌లో ఉదయం 7 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.45 గంటలకు తిరుపతికి చేరుతుందని చెప్పింది. తిరుపతి–జాల్నా రైలు మంగళవారం మధ్యాహ్నం 3.15 గంటలకు బయలుదేరి.. మధ్యాహ్నం 3.50 గంటలకు గమ్యస్థానం చేరుతుందని వివరించింది. చర్లపల్లి–నర్సాపూర్–చర్లపల్లి రైలు నల్గొండ, మిర్యాలగూడ, నడికుడ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, విరసవరం, పాలకొల్లు స్టేషన్లలో ఆగుతుందని పేర్కొంది.

## వైసీపీ హయాంలో షర్మిల

# ఫోన్లు ట్యాప్ అయినట్లు గుర్తింపు

- కోడ్ భాష వాడి సంభాషణలు రికార్డ్ చేశారని ఆరోపణ
- వివరాలు ఎప్పటికప్పుడు జగన్‌కు చేరవేశారని సమాచారం

వేద న్యూస్, డెస్క్:



తెలంగాణలో ప్రకంపనలు సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖుల ఫోన్లు ట్యాపింగ్‌కు గురైనట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఇప్పటికే గుర్తించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేరు కూడా చేరినట్లు తెలుస్తోంది. ఏపీలో వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో షర్మిల మొబైల్ ఫోన్లను అత్యంత రహస్యంగా ట్యాప్ చేసినట్లు సమాచారం. ఇందుకోసం ప్రత్యేకంగా కోడ్ భాషను కూడా ఉపయోగించినట్లు తెలుస్తోంది. షర్మిల వాయిస్ సంభాషణలను రికార్డు చేయడమే కాకుండా, ఆమె ఎవరెవరితో మాట్లాడుతున్నారనే వివరాలను ఎప్పటికప్పుడు ఆమె సోదరుడి (జగన్)కి చేరవేసినట్లు ఆరోపణలున్నాయి. షర్మిల ఎవరితో సంప్రదింపులు జరుపుతున్నారనే దానిపై నిశితంగా నిఘా పెట్టినట్లు కూడా వార్తలు వస్తున్నాయి. అంతేకాకుండా, షర్మిలకు సన్నిహితంగా ఉండే కొందరిని ఓ సీనియర్ పోలీస్ అధికారి పిలిపించి హెచ్చరించినట్లు కూడా గుర్తించారు. తన ఫోన్లు ట్యాప్ అవుతున్నాయన్న విషయాన్ని షర్మిల అప్పట్లోనే పసిగట్టినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఆమె వద్ద కీలక ఆధారాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ అంశానికి సంబంధించి పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.



# 1న బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం

వేద న్యూస్, హైదరాబాద్:

జూలై 1న హైదరాబాద్ బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం నిర్వహించనున్నట్లు హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కల్యాణం, రథోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. కల్యాణం నేపథ్యంలో చేయాల్సిన ఏర్పాట్లపై మంత్రి సోమవారం ఆలయం వద్ద సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అమ్మవారి కల్యాణం తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే లక్షలాదిమంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్యూ లైన్ల ఏర్పాటుతో పాటు శానిటేషన్ కోసం అదనంగా సిబ్బందిని, మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు.ఉచిత తాగునీటి సరఫరా, అదనంగా వాటర్ ట్యాంకర్ల ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. జోగినీలు, శివసత్తులకు అమ్మవారి దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, కలెక్టర్ హరిచందన, డీసీపీ విజయ్‌కుమార్, కార్పొరేటర్ సరళ, ఆలయ చైర్మన్ సాయిబాబాగౌడ్, ఈవో రవీందర్‌గౌడ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మరో ఐదురోజులు వర్షాలు



వేద న్యూస్, డెస్క్:

తెలంగాణలో మరో ఐదురోజులు వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నైరుతి బంగ్లాదేశ్, దాన్ని ఆనుకొని ఉన్న పశ్చిమ బెంగాల్‌లోని గంగా తీరప్రాంతంలో ఉదయం 8.30 గంటలకు అల్పపీడనం కొనసాగుతుందని పేర్కొంది. అనుబంధంగా ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఎత్తుకు వెళ్లేకొలది దక్షిణం దిశగా వంగి ఉందని పేర్కొంది.మంగళవారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశాలున్నాయని చెప్పింది. బుధవారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో.. గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాల్లో.. శుక్రవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మల్కాజ్‌గిరి, సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వర్షాలు కొనసాగుతాయని పేర్కొంది. శనివారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వర్షాలు కొనసాగుతాయని వాతావరణశాఖ వివరించింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఇదిలా ఉండగా గడిచిన 24గంటల్లో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, పెద్దపల్లి, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నిర్మల్ జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిశాయి.

## ఇజ్రాయెల్ మొసాద్ కార్యాలయంపై ఇరాన్ బాంబుల మోత!

వేద న్యూస్, డెస్క్:

ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రస్థాయికి చేరుకున్నాయి. ఇజ్రాయెల్ అణుకేంద్రాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తుండగా, ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌లోని కీలక ప్రాంతాలపై క్షిపణులతో విరుచుకుపడుతోంది. ఇజ్రాయెల్ గూఢచార సంస్థ మొసాద్ కేంద్ర కార్యాలయంపై ఇరాన్ బాంబులతో దాడి చేసినట్లు ఇరాన్ మీడియా వర్గాలు వెల్లడించాయి. అత్యంత కచ్చితత్వంతో ఈ దాడి జరిగిందని సదరు మీడియా పేర్కొంది. అంతేకాకుండా, గ్లిలాట్‌లోని ఇజ్రాయెల్ మిలటరీ ఇంటెలిజెన్స్ కాంప్లెక్స్‌ను కూడా క్షిపణితో లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపింది. ఇజ్రాయెల్ దాడుల వెనుక మొసాద్ సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని ఇరాన్ ఆరోపిస్తోంది. ఇరాన్‌లోని అణు స్థావరాల వివరాలు, కీలక శాస్త్రవేత్తలు, అధికారుల నివాసాల సమాచారాన్ని మొసాద్ ఇజ్రాయెల్‌కు చేరవేసిందని చెబుతున్నారు. ఇరాన్‌లోకి భారీగా డ్రోన్లను తరలించి ఇజ్రాయెల్ చేపట్టిన కోవర్ట్ ఆపరేషన్ వెనుక కూడా మొసాద్ హస్తం ఉందని ఆరోపణలున్నాయి.

# సంపాదకీయం

## విమానయానం గాలిలో దీపం

ఈ ఏడాది కేదార్‌నాథ్ యాత్ర సీజన్‌లో వరసగా చోటు చేసుకొంటున్న హెలికాప్టర్ ప్రమాదాలు ప్రయాణికుల భద్రతపై తీవ్ర ఆందోళనను రేకెత్తిస్తున్నాయి. ఆదివారం కేదార్‌నాథ్‌నుంచి గౌరీకుండ్‌కు వస్తున్న హెలికాప్టర్ గుప్తకాశి వద్ద కూలిపోవడంతో పైలట్, రెండేళ్ల చిన్నారి సహా హెలికాప్టర్‌లోని మొత్తం ఏడుగురూ చనిపోయారు. చార్‌ధామ్ యాత్ర ప్రారంభమైన నెలన్నర రోజుల్లోనే ఇది అయిదో హెలికాప్టర్ ప్రమాదం కావడం గమనార్హం. ఇంతకు ముందు కూడా గత మే 8న ఉత్తర కాశీలో గంగోత్రికి యాత్రికులను తీసుకు వెళ్తున్న హెలికాప్టర్ లోయలో పడిపోవడంతో ఆరుగురు ప్రయాణికులు చనిపోగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. మరో మూడు హెలికాప్టర్ ప్రమాదాలు సంభవించినప్పటికీ అదృష్టవశాత్తు ప్రాణనష్టం జరగలేదు. అయితే నెలన్నర వ్యవధిలోనే ఇన్ని హెలికాప్టర్ ప్రమాదాలు ఎందుకు జరిగాయి? దీనికి కారణాలేమిటి? అన్న ప్రశ్నలు ప్రతిఒక్కరిలో తలెత్తుతున్నాయి. ఆదివారం జరిగిన ప్రమాదానికి వాతావరణం హటాత్తుగా ప్రతికూలంగా మారడమే కారణమని తెలుస్తోంది. పైలట్ దట్టమైన పొగమంచు మధ్యలోకి వెళ్లి ఉండవచ్చని, ఎదురుగా ఏముందో కూడా కనిపించని స్థితిలో హెలికాప్టర్ కొండను ఢీకొని కూలిపోయి ఉంటుందని నిపుణులు అంటున్నారు. అయితే ప్రమాదం జరిగిన తీరు గమనిస్తే నిర్వాహకుల నిర్లక్షం కూడా కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఈ ప్రమాదం తెల్లవారు జామున 5.17 గంటల సమయంలో జరిగింది. వాస్తవానికి కేదార్‌నాథ్‌లో వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఉదయం 6 గంటలతర్వాతినుంచి సాయంత్రం వరకు మాత్రమే హెలికాప్టర్ సేవలకు అనుమతి ఉంది. దీనికి భిన్నంగా ఆర్యన్ ఏవియేషన్ లిమిటెడ్‌కు చెందిన హెలికాప్టర్ తెల్లవారుజామునే బయలుదేరడాన్ని గమనిస్తే నిర్వాహకుల నిర్లక్షం ఎంత ఉందో అర్థం అవుతుంది.

కేదార్‌నాథ్ ఆలయం హిమాలయ పర్వతాల మధ్య ఉంది. ఇక్కడ వాతావరణం క్షణాల్లో మారిపోతూ ఉంటుంది. పైగా అంతా నిటారయిన కొండలు, లోయలతో కూడిన దట్టమైన అటవీ ప్రాంతం. అలాంటప్పుడు భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఉత్తరాఖండ్ ప్రభుత్వం హెలికాప్టర్ సేవలకు అనుమతించింది కానీ భద్రత విషయాలను పెద్దగా పట్టించుకున్నట్లు కనిపించదు. కంట్రోల్ టవర్స్ కానీ, వాతావరణానికి సంబంధించి ముందస్తు సమాచారాన్ని అందించే ఏర్పాట్లు కానీ లేకపోవడంతో హెలికాప్టర్ ఆపరేటర్లు తమ ఇష్టానుసారం హెలికాప్టర్ సర్వీసులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆదాయానికి ప్రాధాన్యత ఇవ్వడంతో ప్రయాణికుల భద్రతను పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. హెలికాప్టర్ ప్రమాదం తర్వాత ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి చేసిన ప్రకటన సైతం ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. అత్యవసర సమావేశం నిర్వహించాక రెండు రోజులు పాటు కేదార్‌నాథ్‌కు హెలికాప్టర్ సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించిన ముఖ్యమంత్రి రాష్ట్రంలో హెలికాప్టర్ సేవలకోసం కఠినమైన నిబంధనావళిని (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్)ను రూపొందించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. అంతేకాకుండా డిజిసిఎ నిబంధనలను కచ్చితంగా పాటించాలని కూడా ఏవియేషన్ కంపెనీలను ఆదేశించారు. హెలికాప్టర్ సర్వీసులను క్రమబద్ధీకరించడంతో పాటుగా ఒక కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు సిఎం ప్రకటించారు. ఇదంతా బాగానే ఉంది కానీ చార్‌ధామ్ యాత్రకోసం చాలా ఏళ్ల క్రితమే హెలికాప్టర్ సర్వీసులను ప్రారంభించిన రాష్ట్రప్రభుత్వం ఇంతకాలంగా ఈ అంశాలపై ఎందుకు దృష్టిపెట్టలేదనే ప్రశ్న ఎవరికైనా వస్తుంది. 2010లో హెలికాప్టర్ సర్వీసులు ప్రారంభమయ్యాయి కానీ ఇప్పటివరకు భద్రత విషయాన్ని పెద్దగా ఎవరూ పట్టించుకున్నట్లు కనిపించదు. వాస్తవానికి కేదార్‌నాథ్ యాత్ర అత్యంత శ్రమతో కూడుకున్నది. గతంలో దుర్గమమైన పర్వత మార్గంలో కాలినడకన, వృద్ధులు, పిల్లలు లాంటి వారయితే గుర్రాల మీద ఆలయానికి చేరుకునే వారు.

అయితే హెలికాప్టర్ సర్వీసును ప్రవేశపెట్టిన తర్వాత రోజు రోజుకు దానికి ఆదరణ పెరుగుతూ వచ్చింది. ప్రభుత్వ ఏజన్సీ ఐఆర్‌సిటిసితో పాటుగా పలు ప్రైవేటు ఏవియేషన్ కంపెనీలు హెలికాప్టర్ బుకింగ్‌తో పాటు సర్వీసులను కొనసాగిస్తున్నాయి. యాత్రికులు సైతం ఈ సర్వీసులకే ఎక్కువ మొగ్గు చూపుతుండడంతో ఏవియేషన్ కంపెనీల మధ్య అనారోగ్యకరమైన పోటీ నెలకొన్నట్లు తెలుస్తోంది. ఫలితంగా ఏటా ప్రమాదాల సంఖ్య పెరిగిపోతోంది. ముఖ్యంగా ఈ ఏడాది కేవలం 40 రోజుల్లోనే అయిదు ప్రమాదాలు సంభవించడం ఆందోళన కలిగిస్తోంది. అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో దాదాపు 280 మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన ఇంకా కళ్ల ముందు మెదులుతున్న నేపథ్యంలో ఉత్తరాఖండ్ హెలికాప్టర్ ప్రమాదాలు మరింత ఆందోళనకు గురి చేస్తున్నాయి. దట్టమైన మంచు కారణంగా చార్‌ధామ్ యాత్రలో భాగమైన నాలుగు ఆలయాలను ఏడాదిలో ఆరు నెలల పాటు మూసి ఉంచుతారనే విషయం అందరికీ తెలిసిందే. ఉత్తరాఖండ్ రాష్ట్రానికి పర్యాటకం ప్రధాన ఆదాయ వనరు కావడంతో ఈ యాత్ర కోసం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తూ ఉంటుంది. దీంతో భక్తుల సంఖ్య కూడా ఇటీవలి కాలంలో బాగా పెరిగింది. అదే ఇప్పుడు సమస్యలకు కారణమవుతోంది. ఆదాయంపై దృష్టిపెట్టిన ప్రభుత్వం అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలపైన కూడా శ్రద్ధ చూపించాల్సి ఉంటుంది. వరస ప్రమాదాల తర్వాతనైనా రాష్ట్రప్రభుత్వం ఈ దిశగా దృష్టి సారించడం మంచి పరిణామమే. హెలికాప్టర్ సేవలపై నిఘాతో పాటుగా వాటి క్రమబద్ధీకరణ, వాతావరణంపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలియజేయడంలాంటి చర్యలు తీసుకోవడం వల్ల ప్రమాదాలను చాలావరకు నివారించవచ్చు. ఎంతో శ్రమకు ఓర్చి చార్‌ధామ్ యాత్రకు వచ్చే భక్తులు క్షేమంగా, యాత్ర ముగించుకుని స్వస్థలాలకు చేరుకునేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

# ఇరాన్ నుంచి అర్మేనియా చేరుకున్న 110 మంది భారతీయ విద్యార్థులు

**వేద న్యూస్, డెస్క్:**

పశ్చిమాసియా మరోసారి భగ్గుమంది. గతవారం ఇరాన్ అణు కేంద్రాలపై ఇజ్రాయెల్ 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరిట దాడులు ప్రారంభించినప్పటి నుంచి ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. వరుసగా ఐదో రోజు కూడా ప్రతిదాడులతో ఇరు దేశాలూ విరుచుకుపడుతున్నాయి. ఈ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. టెహ్రాన్‌లోని తమ పౌరులను సురక్షితంగా స్వదేశానికి తరలించే ప్రక్రియను ప్రారంభించింది. ఇప్పటికే 110 మంది భారతీయ విద్యార్థులు ఇరాన్ ను వీడి అర్మేనియా కు క్షేమంగా చేరుకున్నారు. వీరంతా ప్రత్యేక విమానంలో రేపు ఢిల్లీకి రానున్నట్లు విదేశాంగ శాఖ ప్రకటించింది. మరోవైపు భారతీయులు తక్షణమే టెహ్రాన్ ను వీడాలని ఎంబసీ తాజాగా కీలక అడ్వైజరీ జారీ చేసిన విషయం తెలిసిందే. టెహ్రాన్‌లోని భారతీయులందరూ సొంత మార్గాల్లో వీలైనంత త్వరగా నగరాన్ని వీడాలని ఆదేశించింది. సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించింది. టెహ్రాన్‌లో నివసిస్తున్న భారతీయ పౌరులు ఆ దేశాన్ని ఖాళీ చేసి రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని పేర్కొంది. ఈ మేరకు టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం భారతీయుల కోసం అత్యవసర హెల్ప్‌లైన్‌ను కూడా ఏర్పాటు చేసింది



**– టెహ్రాన్ ఎయిర్‌పోర్ట్‌పై ఇజ్రాయెల్ దాడి**

మరోవైపు టెహ్రాన్ ఎయిర్‌పోర్ట్ పై ఇజ్రాయెల్ భీకర దాడి చేసింది. ఈ దాడిలో ఇరాన్‌కు చెందిన రెండు -14 యుద్ధ విమానాలు ధ్వంసమయ్యాయి. ఇందుకు సంబంధించిన వీడియోని ఐడీఎఫ్ దళాలు సోషల్ మీడియా ద్వారా షేర్ చేశాయి. ఇజ్రాయెల్ విమానాలను అడ్డుకునేందుకు టెహ్రాన్ వీటిని ఎయిర్‌పోర్ట్‌లో సిద్ధంగా ఉంచినట్లు పేర్కొంది. తమ దాడిలో ఆ ఫైటర్ జెట్స్ పూర్తిగా ధ్వంసమైనట్లు వెల్లడించింది.

# మరో ఎయిర్ ఇండియా విమానంలో సాంకేతిక సమస్య

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**




ఎయిర్ ఇండియా విమానాల్లో సాంకేతిక సమస్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. గత వారం అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్తున్న డ్రీమ్‌లైనర్ రకానికి చెందిన 171 విమానం కుప్పకూలిన విషయం తెలిసిందే. తాజాగా అదే రూట్‌లో ప్రయాణించే మరో విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో విమాన సర్వీసును అధికారులు రద్దు చేశారు. ఎయిర్ ఇండియా విమానం 159 మంగళవారం ఉదయం న్యూ ఢిల్లీ నుంచి అహ్మదాబాద్ చేరుకుంది. అక్కడి నుంచి అది లండన్ బయల్దేరాల్సి ఉంది. అయితే, టేకాఫ్‌కు ముందు విమానంలో సాంకేతిక సమస్య తెలెత్తింది. దీంతో అప్రమత్తమైన అధికారులు విమాన సర్వీసును చివరి నిమిషంలో రద్దు చేశారు. ఎయిర్ ఇండియా విమానాల్లో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. సోమవారం హాంకాంగ్ నుంచి ఢిల్లీకి బయల్దేరిన బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ రకానికి చెందిన ఏఐ 315 విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో విమానాన్ని వెనక్కి మళ్లించారు. ఇవాళ ఉదయం కూడా శాన్ ఫ్రాన్సిస్కో నుంచి కోల్‌కతా మీదుగా ముంబై వస్తున్న ఏఐ180 విమానంలో టెక్నికల్ ఇష్యూలు వచ్చాయి. గుర్తించిన పైలట్ మంగళవారం తెల్లవారుజామున కోల్‌కతాలో విమానాన్ని నిలిపివేశారు. దీంతో భద్రత దృష్ట్యా ప్రయాణికులను విమానం నుంచి దించేశారు. విమానంలోని ఇంజిన్లలో ఒకటి పనిచేయడం లేదని, దీంతో విమానం ఎగరడంలో ఇబ్బందులు తలెత్తాయని అధికారులు తెలిపారు. కాగా, గత గురువారం అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం కుప్పకూలిన విషయం తెలిసిందే. బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ రకానికి చెందిన విమానం టేకాఫ్ అయిన నిమిషాల్లోనే ఓ బిల్డింగ్‌పై కూలిపోయింది. ఈ దుర్ఘటనలో 270 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది గాయపడ్డారు. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన యావత్తు దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది.

# దావణగెరెలో సీఎం సిద్ధరామయ్య సవాల్

**వేద న్యూస్,బెంగళూరు:**



అభివృద్ధి విషయంలో కేంద్రం మాకు ద్రోహం చేసిందనే విషయంలో నేను అబద్ధాలు చెప్పినట్టు నిరూపిస్తే ఇకపై వేదికలపై ప్రసంగాలు చేసేది లేదని సీఎం సిద్ధరామయ్య సవాల్ విసిరారు. దావణగెరె జిల్లాలో సోమవారం రూ.1350 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వివిధ పథకాల లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. అభివృద్ధి, సంక్షేమంలో కులమతాలు, పార్టీలు చూడమన్నారు. అన్ని పార్టీలవారు మా గ్యారెంటీల లబ్ధిదారులన్నారు. 15వ ఫైనాన్స్ కమిషన్ ద్వారా రూ.11,500 కోట్లు రాష్ట్రానికి అన్యాయం జరిగిందని, భద్ర ఎగువ ప్రాజెక్టుకు కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన 5వేల కోట్లు ఇవ్వలేదని, ఇదే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన ద్రోహమన్నారు. ప్రతిపక్షనేత అశోక్, బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర బహిరంగచర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. 56 అంగుళాల ఛాతీ కల్గిన ప్రధాని మోదీ విఫలమయ్యారన్నారు. ఛాతీ ఎన్ని అంగుళాలు ఉంటే మాత్రం పేదలు, మధ్య తరగతి ప్రజలపట్ల అభిమానం, మానవత్వం ఉండాలన్నారు. రాష్ట్రఖజానాలో నిధులు లేవనే బీజేపీకి అభివృద్ధి కనిపించడం లేదన్నారు. ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు అందిస్తున్నామన్నారు. గ్యారెంటీలు అమలు కావని ఎన్నోసార్లు చెప్పారన్నారు. దేశంలో ఎవరికంటికైనా మంచి రోజులు కనిపించాయా..? అంటూ ఎద్దేవా చేశారు. బీజేపీ అబద్ధాలకు రాష్ట్ర ప్రజలు పట్టించుకోవడం లేదన్నారు. ఉప ఎన్నికల్లో శిగ్గావి, చన్నపట్టణలో మాజీ సీఎంల కుమారులే ఓడారని, సండూరులో మేమే గెలిచామన్నారు.

**– శ్యామనూరు కోరితే వచ్చే ఎన్నికల్లోనూ టిక్కెట్**

శ్యామనూరు శివశంకరప్ప 95వ జన్మదినం జరుపుకోవడం సంతోషంగా ఉందని, ఆయన కోరితే వచ్చే ఎన్నికల్లోనూ టిక్కెట్ ఇస్తామని సీఎం ప్రకటించారు. శ్యామనూరు శివశంకరప్ప బర్త్‌డే కేక్ కట్ చేశారు. ఇదే సందర్భంగా కులాంతర వివాహాలను జరిపించారు. డీసీఎం డీకే శివశకుమార్, హెూం మంత్రి పరమేశ్వర్, శ్యామనూరు కుమారుడు, ఉద్యానవన శాఖ మంత్రి మల్లికార్జున, కోడలు ప్రభా మల్లికార్జునతోపాటు పలువురు పాల్గొన్నారు.

# హిమాచల్ ప్రదేశ్‌లో లోయలో పడ్డ బస్సు..

**వేద న్యూస్, డెస్క్:**



హిమాచల్ ప్రదేశ్‌లో రోడ్డు ప్రమాదం జరిగింది. మండి జిల్లా ప్రతీఘాట్ వద్ద బస్సు లోయలో పడింది . ఈ ఘటనలో 17 మంది ప్రయాణికులు గాయపడ్డారు. బస్సు పలువురు ప్రయాణికులతో జహు నుంచి మండి వెళ్తోంది. ఈ క్రమంలో ప్రతీఘాట్ వద్దకు రాగానే అదుపుతప్పి లోయలో పడిపోయింది. ఈ ఘటనలో 17 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకొని రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# కర్ణాటక ప్రభుత్వానికి కౌంటర్!

వేద న్యూస్, డెస్క్ :

కమల్ హాసన్ కు బిగ్ రిలీఫ్ దక్కింది. కర్ణాటకలో తమిళ చిత్రం 'థగ్ లైఫ్' రిలీజ్ విషయంలో ప్రభుత్వం, హైకోర్టు ఆంక్షలు విధించడంపై సుప్రీం కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. అల్లరిమూకలు రోడ్లపైకి వచ్చి సినిమా విడుదలను అడ్డుకోవాలని నినాదాలు చేయడం సరికాదని జస్టిస్ ఉజ్జల్ భూయాన్, మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. కమల్ హాసన్ చిత్రం 'థగ్ లైఫ్' విడుదలకు వెంటనే అనుమతించాలని సుప్రీంకోర్టు మంగళవారం కర్ణాటక ప్రభుత్వాన్ని ఆదేశించింది.

– కర్ణాటక ప్రభుత్వానికి సుప్రీం ఆదేశం..

కర్ణాటకలో కమల్ హాసన్ 'థగ్ లైఫ్' రిలీజ్ కు లైన్ క్లియర్ అయింది. మంగళవారం చిత్రనిర్మాతలు కర్ణాటకలో సినిమా విడుదలకు అనుమతి కోరుతూ దాఖలు చేసిన పిల్ ను సుప్రీంకోర్టు విచారించింది. జస్టిస్ ఉజ్జల్ భూయాన్, మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం థగ్ లైఫ్ విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం కర్ణాటక ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించింది. ఎక్స్‌ట్రా-జ్యుడీషియల్ నిషేధం పేరిట కర్ణాటక హైకోర్టు తీర్పు ఇవ్వడాన్ని తప్పుబట్టింది. కర్ణాటక హైకోర్టు కమల్ హాసన్‌ను క్షమాపణ అడగాల్సి ఉండకూడదని అభిప్రాయపడింది. 'థగ్ లైఫ్' కేసును సుప్రీంకోర్టుకు బదిలీ చేయడంపై ధర్మాసనం అభ్యంతరం వ్యక్తం చేసింది. అల్లరి మూకలు వీధుల్లోకి వచ్చి విధ్వంసం సృష్టించడాన్ని సహించబోమని.. చట్టబద్ధమైన పాలన చేయడమే ప్రభుత్వాల కర్తవ్యమని గుర్తుచేసింది. సర్టిఫికేట్ ఉన్న సినిమా దేశంలోని ప్రతి రాష్ట్రంలోనూ విడుదల చేయాలని చట్ట నియమం చెబుతోంది. సినిమా విడుదలను నిలిపివేసి, ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం ద్వారా సినిమా హాళ్లను తగలబెట్టేస్తామని బెదిరించడానికి ఆస్కారం లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. బుధవారం లోగా తన ప్రతిస్పందనను తెలియజేయాలని సుప్రీం కోర్టు కర్ణాటక ప్రభుత్వాన్ని ఆదేశించింది. తమిళం నుంచి కన్నడ పుట్టిందంటూ కమల్ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో కర్ణాటకలో థగ్ లైఫ్ సినిమాపై బ్యాన్ విధించిన సంగతి తెలిసిందే.

# బాల్కనీల నుంచి దూకిన విద్యార్థులు..

**ఇంటర్నెట్ డెస్క్:**

అహ్మదాబాద్‌లో గత గురువారం ఎయిర్ ఇండియా విమానం కుప్పకూలిన విషయం తెలిసిందే. అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి లండన్ బయల్దేరిన డ్రీమ్‌లైనర్ రకానికి చెందిన విమానం టేకాఫ్ అయిన నిమిషాల వ్యవధిలోనే బీజే మెడికల్ కాలేజీ బిల్డింగ్‌పై కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదానికి సంబంధించి తాజాగా మరో వీడియో వెలుగులోకి వచ్చింది. విమానం కూలిన వెంటనే అక్కడ భారీ శబ్దం వచ్చింది. పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఆ ప్రాంతాని నల్లటి పొగ కమ్ముకుంది. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమీపంలోని వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులు ఊపిరాడక.. బాల్కనీల నుంచి దుస్తుల సాయంతో కిందకు దిగుతున్న వీడియో వెలుగులోకి వచ్చింది. ఆ వీడియోలో వైద్య విద్యార్థులు దుస్తులను జాయింట్ చేసి కిటీకీలు, బాల్కనీల నుంచి కిందకు దిగేందుకు ప్రయత్నిస్తూ కనిపించారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతోంది. గతవారం ఎయిర్ ఇండియాకు చెందిన డ్రీమ్‌లైనర్ ఫ్లైట్ అహ్మదాబాద్‌లో కుప్పకూలిన విషయం తెలిసిందే. లండన్ బయల్దేరిన విమానం టేకాఫ్ అయిన నిమిషాల వ్యవధిలోనే ఓ బిల్డింగ్‌పై కుప్పకూలిపోయింది. ప్రమాద సమయంలో విమానంలో ఇద్దరు పైలటర్లు, పది మంది క్రూ సిబ్బంది, 230 మంది ప్రయాణికులు ఉన్నారు.

వేద న్యూస్

బుధవారం జూన్ 18, 2025



## తాగునీటి బోరు బావి ప్రారంభం

**వేద న్యూస్, ఎల్కతుర్తి:**

ఎల్కతుర్తి మండలకేంద్రంలోని జీపీ ఆఫీసు సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద తాగునీటి కోసం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్..తన సొంత నిధులు మంజూరు చేశారు. సదరు బోరు బావిని మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ నేతలతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో అక్కన్నపేట మండల బీజేపీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, హుస్నాబాద్ రూరల్ మండల్ అధ్యక్షులు సంపత్ నాయక్, సీనియర్ నాయకులు కంచర్ల శంకరయ్య, జనగాం కిష్టయ్య, ఆడపు శ్రీ వర్ధన్, నాంపల్లి అశోక్ మామాజీ సర్పంచులు బూర్గుల రామారావు, శ్యామల సురేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.




## అక్రమ భూకబ్జాలపై విచారణ జరిపించాలి

**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట మండల పరిధిలోని కోరపల్లి గ్రామంలో ఆ విలేజ్ మాజీ సర్పంచ్ బోయిని సమ్మయ్య అక్రమ భూకబ్జాలపై విచారణ జరిపించాలని గ్రామస్తులు మంగళవారం ధర్నా చేశారు. సదరు వ్యక్తి అక్రమంగా అంబేడ్కర్ ఆట స్థలం, చర్చి స్థలం, దళితుల భూములను ఆక్రమించారని ఆరోపించారు. గత 15 ఏండ్ల నుంచి జరుగుతున్న ఈ కబ్జాల విషయమై ఎంక్వయిరీ చేయాలని కోరారు. మోక మీద ఒక్క గుంటకు పట్టా లేకున్నా సాదా బైనమా ఆర్ఓఆర్ చట్టం కింద అప్పుడున్న అధికారులతో కుమ్మక్కై.. 13బీ తయారుచేసుకొని సుమారు 22 నుంచి 30 ఎకరాల చాలా విలువైన భూమిని అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. భూభారతి సదస్సులో బాధితులు అందరూ కలిసి తమ తమ సమస్యల మీద జమ్మికుంట మండల తహశీల్దారుకు ఈ విషయమై దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమం లో గ్రామస్తులు పుల్లూరు సంపత్, ఈశ్వర్, పుల్లూరు పోచయ్య, ఐలయ్య, అనిల్, ప్రభాకర్, భాస్కర్, గిరవెన శ్రీనివాస్, కొమురయ్య తిరుపతమ్మ, కవిత, లక్ష్మి పూలమ్మ, సుగుణ, భాస్కర్ పాల్గొన్నారు.



## విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

**వేద న్యూస్, నల్లబెల్లి :**

తన తండ్రి జ్ఞాపకార్థం తాను పనిచేస్తున్న పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేశారు ఓ ఉపాధ్యాయుడు. నల్లబెల్లి మండలంలోని అర్వయ్యపల్లి ప్రాథమికొన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రం బోధిస్తున్న అన్న మహేందర్ అనే ఉపాధ్యాయుడు తన తండ్రి అన్న కొమురయ్య జ్ఞాపకార్థం సదరు పాఠశాల విద్యార్థులకు ఉపయుక్తమయ్యే నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను పనిచేస్తున్న పాఠశాల విద్యార్థుల కోసం ఎంతో కొంత సాయం చేయాలన్నా తపనతో సుమారు రూ.2 వేలు విలువ చేసే నోటు పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ యూపీఎస్ అర్వయ్యపల్లి ప్రధానోపాధ్యాయులు వి.కిషన్, ఉపాధ్యాయులు సతీష్, సుకన్య, మంజుల పాల్గొన్నారు.



## గురవయ్య మరణం సిపిఐకి తీరని లోటు

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

దామచర్ల మండలం బొత్తలపాలెం గ్రామ సిపిఐ పార్టీ సభ్యుడు పోలేపల్లి గురువయ్య అనారోగ్యంతో బాధపడుతూ బొత్తలపాలెం గ్రామంలో తుది శ్వాస విడిచారు.మిర్యాలగూడ నియోజకవర్గ పార్టీ సభ్యులు ప్రజాసంఘాల నాయకులు గురువయ్య పార్థివ దేహానికి ఎర్రజెండా కప్పి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. గురవయ్య మరణం సిపిఐ పార్టీకి తీరని లోటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఎండి సయ్యద్,మండల కార్యదర్శిలు ధీరావత్ లింగ నాయక్ ,అంజనపల్లి రామలింగం,జిల్లా యాదగిరి,దామరచర్ల మండలం సహకార దర్శి ధానావత్ శాంతి మండల సమితి సభ్యులు పోలేపల్లి ఉదయ్,జమ్ముల కోటయ్య,లక్ష్మయ్య తదితరులు ఘనంగా నివాళులర్పించారు.

# సీజనల్ వ్యాధుల నివారణకు..

# జాగ్రత్తలే ప్రధానం

- ఆందోళన వద్దు.. అవగాహన పెంచుకోండి
- ఎండీ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ యూ.సురేశ్



**వేద న్యూస్, జమ్మికుంట:**

వానాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉన్నది. ఫీవర్, నీరసం, దగ్గు, వాంతులు వంటి లక్షణాలతో జనం అవస్థలు పడే చాన్సెస్ ఉంటాయి. పరిసరాల అపరిశుభ్రత కారణంగా వచ్చే వ్యాధులతో పాటు ఆహార కాలుష్యం వల్ల సీజనల్ డిసీజెస్ తో ప్రజలు అనారోగ్యం పాలు అయ్యే అవకాశాలు మెండుగా ఉంటాయి. ఈ నేపథ్యంలో సీజనల్ డిసీజెస్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధుల బారిన పడకుండా ఉండడానికి ఏం చేయాలనే విషయాలపై ఐఎంఏ హుజూరాబాద్, జమ్మికుంట శాఖ ప్రధాన కార్యదర్శి, 'సంజీవని' మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యుడు, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఊడుగుల సురేశ్ వివరించారు. అవేంటో మీరూ చదివి తెలుసుకోండి..

వర్షాల వల్ల మురికి నీరు చేరి.. దోమలు ఎక్కువైపోయాయి. పైగా వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు అధికమవుతాయి. జ్వరం, కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలు, శ్వాసకోశ సమస్యలు, తిన్న ఆహారం జీర్ణంకాక పోవడం వంటివి సీజనల్ వ్యాధులుగా చెప్పుకోవచ్చు. వానాకాలంలో వచ్చే మరి కొన్ని వ్యాధులు ఇన్‌ఫ్లుఎంజా, మలేరియా, డెంగ్యూ జ్వరం, టైఫాయిడ్ జ్వరంతో పాటు హెపటైటిస్- ఏ. ఈ వ్యాధులు ప్రధానంగా వెలుగు చూస్తుంటాయి. ఈ వ్యాధులు బారిన అన్నీ వయసుల వారు పడుతుంటారు.

ఈ వ్యాధులు సోకడానికి ప్రధానంగా కలుషిత ఆహారం, మురికి నీరు. ఎక్కువ కాలం ఒకే ప్రాంతంలో నిలిచి ఉన్న మురికి నీరు.. వాటి పై వాలే దోమలు ఈ వ్యాధులకు ప్రధాన కారణం అవుతున్నాయి. అంతే కాకుండా ఈ సమయాల్లో చాలా మంది దగ్గుతూ కనిపిస్తారు. ఇలా ఒకరి నుంచి మరోకరికి దగ్గు వ్యాప్తి చెందే అవకాశం ఉంది.

ముఖ్యంగా దోమల వల్ల వ్యాపించే మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు కొన్నిసార్లు మరింత ప్రమాదకరమైనవిగా మారుతాయి. అందుకే వాటిని ముందుగా గుర్తించి అశ్రద్ధ చేయకుండా.. చికిత్స చేయించుకోవాలి. ఇలాంటి సమయాల్లోనే 'స్క్రబ్ టైఫస్' అనే ప్రాణాంతక జ్వరం కూడా దేశ వ్యాప్తంగా వ్యాపిస్తోంది. ఈ జ్వరం కూడా డెంగ్యూ జ్వరాన్ని పోలి ఉంటుంది. కానీ దీని తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుంది. కలుషిత ఆహారం వల్ల వికారం, వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పి వచ్చే అవకాశం ఉంది. ఇలాంటి లక్షణాలు కనిపించినట్లయితే నిర్లక్ష్యం చేయకుండా.. వెంటనే డాక్టర్లను సంప్రదించడం ఉత్తమం. అనంతరం వైద్యుల సూచనల మేరకు కామెర్లు మలేరియా, డెంగ్యూ జ్వరం, స్క్రబ్ టైఫస్, లెప్టోస్పిరోసిస్, హెపటైటిస్ పరీక్షలు చేయించుకోవాలి.

### సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు

- చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. ఇలా చేయడం వల్ల కరోనాను అరికట్టడంతో పాటు అతిసార వ్యాధిని, ఇతర సీజనల్ వ్యాధులను కూడా దూరం చేసుకోవచ్చు.
- తీసుకునే ఆహారం, తాగే నీటి విషయంలో జాగ్రత్త వహించాలి. కలుషిత ఆహారం, నీటిని దూరంగా ఉంచడం వల్ల డయేరియా, టైఫాయిడ్ జ్వరం నుంచి రక్షణ పొందవచ్చు.
- డెంగ్యూ, మలేరియాల జ్వరాలు సోకకుండా ఉండాలంటే దోమలు కుట్టకుండా దోమతెరలు, రిపెల్లెంట్లు ఉపయోగించాలి.
- మనం నివసిస్తున్న ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. చుట్టుపక్కలా ఎక్కడా మురుగు నీరు నిలిచిపోకుండా చూసుకోవాలి.
- వీలైనంత వరకు తాజా ఆహారాన్ని తీసుకోవడంతో పాటు కాచి చల్లార్చిన నీటిని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చు.
- పానీపూరీ, ఇతర జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి.మాస్క్ ధరించడం వల్ల సాధారణ జలుబు, ఫ్లూ వంటి శ్వాసకోశ వ్యాధుల రాకుండా జాగ్రత్త వహించవచ్చు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి

## రేవంత్ సర్కారుపై కేటీఆర్ సేన జిల్లా అధ్యక్షుడు ఆగ్రహం

**వేద న్యూస్, వరంగల్ :**

రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ఇచ్చిన హామీలను విస్మరించి, విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని కేటీఆర్ సేన వరంగల్ జిల్లా అధ్యక్షుడు మైనాల నరేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలేజ్ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఇప్పటివరకు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని చెప్పారు. ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యా సంస్థలు విద్యార్థులపై ఫీజు కోసం ఒత్తిడి తెస్తుండటంతో చాలామంది విద్యార్థులు తమ చదువు కొనసాగించలేని పరిస్థితిలోకి వెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడుతోందని తెలిపారు.



వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోతే, కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్ అధ్వర్యం లో రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ ముట్టడిని చేపడతామని హెచ్చరించారు. సదరు సేన జిల్లా ప్రధాన కార్యదర్శి మింటిరెడ్డి అశోక్, సోషల్ మీడియా ఇంచార్జి బాబుమియా, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వీసం భరత్ రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి పిన్నింటి మణిదీప్ రావు పరకాల నియోజక వర్గ ఇంచార్జ్ అభిషేక్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మాట నిలబెట్టుకున్న అత్తర్

## అంగన్ వాడీ కేంద్రానికి ఫ్యాన్, లైట్ బహూకరణ

**వేద న్యూస్, వరంగల్:**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 40వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మీర్జా అత్తర్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. వివరాలలోకెళితే.. ఇటీవల అంగన్వాడీ టీచర్స్ నిర్వహించిన బడి బాట కార్యక్రమంలో అత్తర్ పాల్గొని.. పరమేశ్వరి టెంపుల్ నందుగల అంగన్వాడీ సెంటర్ కు సీలింగ్ ఫ్యాన్, ఎల్ఈడి ట్యూబ్ లైట్లు ఇస్తానన్న మాట ప్రకారం.. మంగళవారం వాటిని అందజేశారు. రంగలీల మైదానం-2 అంగన్వాడీ సెంటర్ ను సందర్శించి పిల్లలకు స్నాక్స్ అందజేశారు. ఆ అంగన్వాడీ సెంటర్ కి కూడా ఫ్యాన్ మరియు ఎల్ఈడి ట్యూబ్ లైట్లు అందజేస్తానని భరోసా ఇచ్చారు. ఈ



కార్యక్రమంలో దయ్యాల వీరేశం,వంగూరి సురేష్, అంగన్వాడీ సెంటర్ టీచర్స్ స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసులను పూర్తి చేయాలి

**మొదటి పేజీ తరువాయి**

కల్పించాలని సూచించారు.ఆన్లైన్ మోసాలకు గురి అయినట్లైతే 1930కు కాల్ చేసి లేదా యన్.సి.ఆర్.పి. https://www.cybercrime.gov.in/ పోర్టల్ నందు నమోదు ఫిర్యాదు నమోదు చేయాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృ ష్టి సారించాలని, ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్లు గా గుర్తించి, సైన్ బోర్డు లను ఏర్పాటు చేయించాలని సూచించారు. హైవే రోడ్లను కలుపుతూ ఉండే లింకు రోడ్లకు స్పీడ్ బ్రేకర్స్ వేయించడం, రోడ్డుకు అడ్డుగా ఉన్న పొదలను తొలిగించే విధంగా చూడాలన్నారు. రోడ్డు ఇంజనీరింగ్ లో లోపాలున్నట్లయితే నేషనల్ హైవే స్టేట్ హైవే అథారిటీ ఇతర సంబంధిత అధికారుల సమన్వయంతో ప్రమాదాల నివారణ కృషి చేయాలని అన్నారు.అలాగే రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతీ రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ లు నిర్వహించాలని,ఓవర్ స్పీడ్,ట్రిపుల్ డ్రైవింగ్,మైనర్లు వాహనాలు నడుపుట లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో రోడ్డు భద్రత నిబంధనల గురించి అవగాహన కల్పించాలని అన్నారు.విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని, దొంగతనాలు జరగకుండా పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు గంజాయిని ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా క్రయ విక్రయాల పైన,జూదం,పి.డి.యస్ అక్రమ రవాణా లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. రిపీటెడ్ గా ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై పిడి యాక్ట్ ను నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతి వాహనాన్ని మంచి కండీషన్లో ఉండే విధంగా జాగ్రత్తగా చూసుకోవాలి అని పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో పోలీస్ వాహనాలను తనిఖీ కార్యక్రమంలో అన్నారు. జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్లో పరిధిలో గల వాహనాల నిర్వహణ లోటు పాట్లపై నిరంతరం పర్యవేక్షిస్తూ, క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టి సమగ్ర నివేదికను నెలవారీగా సమర్పించాలని మోటార్ వాహనాల అధికారికి తెలియజేశారు.వాహనాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంచి కండిషన్లో ఉంచుకోవాలని వాహన డ్రైవర్లకు ఆదేశించారు.

పోలీసు అధికారుల ఆధీనంలో ఉన్న వాహనాలను సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సొంత వాహనంల మంచి కండిషన్లో ఉంచి ఎప్పటికప్పుడు సర్వీసింగ్, ఇంజన్ ఆయిల్, టైర్ల నిర్వహణ ఉత్తమ ప్రమాణాలను పాటించాలని అన్నారు.ప్రతి డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహన వేగం పరిమితికి లోబడి నడపాలని అన్నారు.ఈ సమావేశంలో ఏఎస్పీ మౌనిక ఐపీఎస్,అడిషనల్ ఎస్పీ రమేష్,నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి,మిర్యాలగూడ డిఎస్పీ రాజశేఖర్ రాజు,సైబర్ క్రైమ్ డీఎస్పీ లక్ష్మీ నారాయణ, సి.ఐ లు, యస్.ఐ లు పాల్గొన్నారు.



## పోలీస్ శాఖ కీర్తి ప్రతిష్టలకు భంగం కలిగించొద్దు

### సీపీ సన్ ప్రీత్ సింగ్

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్ :**

పోలీస్ కీర్తి ప్రతిష్టలకు భంగం కలిగించే రీతిలో వ్యవహరించవద్దని పోలీస్ కమిషనర్ పోలీస్ అధికారులకు సూచించారు. హన్మకొండ, సుబేదారి, ఏనుమాముల పోలీస్ స్టేషన్లతో పాటు సిసిఎస్, టాస్క్ ఫోర్స్, యాంటీ డ్రగ్స్ విభాగాల్లో నూతన ఇన్స్ స్పెక్టర్లుగా బాధ్యతలు చేపట్టిన శివకుమార్, రంజిత్, రాఘవేందర్, సత్యనారాయణ, సతీష్‌లు వరంగల్ పోలీస్ కమిషనర్ ను మర్యాద పూర్వకంగా కలుసుకొని మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ అప్పగించిన పనులను సమర్ధవంతంగా పనిచేయడంతో పాటు పోలీసులకు వద్దకు వెళ్తే న్యాయం జరుగుతుందని నమ్మకాన్ని పెంచాలని సీపీ తెలిపారు.

## శానిటేషన్ నిర్వహణలో అలసత్వం వద్దు

**మొదటి పేజీ తరువాయి**

పాల్గొన్నారు. చార్ బౌలి వాటర్ ట్యాంక్ ఆవరణలో నిర్వహిస్తున్న డిఆర్ సిసి సెంటర్ తో పాటు నర్సరీని పరిశీలించి నిర్వహణ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్న బయోగ్యాస్ ప్లాంట్ ను సందర్శించి నిర్వహణ తీరును ప్రశంసించిన కమిషనర్ ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచడంతోపాటు మరింత బలోపేతం చేస్తూ మరో ప్లాంటు ఏర్పాటు కు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిఎంహెచ్ఓ డా.రాజారెడ్డి, ఇంచార్జి ఎస్ ఈ, సిపి లు శ్రీనివాస్, రవీందర్ రాడేకర్, వెటర్నరీ డాక్టర్ డా.గోపాల్ రావు, ఏంహెచ్ఓ డా.రాజేష్, ఏసిపి ఖలీల్, సానిటరీ సూపర్ వైజర్ భాస్కర్, ఏఈ లు మొజామిల్, హబీబ్ శానిటరీ ఇన్స్పెక్టర్ శ్యామ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## గో సంరక్షణకు సమగ్ర విధానం

**మొదటి పేజీ తరువాయి**

సంస్కృతిలో గోవులకు ఉన్న ప్రాధాన్యం, భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకోవడంతో పాటు గోవుల సంరక్షణే ప్రధానంగా విధానాల రూపకల్పన ఉండాలని ముఖ్యమంత్రి చెప్పారు. కోడె మొక్కులు చెల్లించే దేవాలయాలైన వేములవాడ, యాదగిరిగుట్టతో పాటు, హైదరాబాద్ నగర సమీపంలోని ఎనికేపల్లి, పశు సంవర్థక శాఖ విశ్వవిద్యాలయం సమీపంలో తొలుత గోశాలలు నిర్మించాలని చెప్పారు. భక్తులు సమర్పించే కోడెల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ కనపర్చాలని, వేములవాడ సమీపంలో వంద ఎకరాలకు తక్కువ కాకుండా గోశాల ఉండాలని అన్నారు. రాష్ట్రంలో గోశాలల నిర్వహణకు సంబంధించిన అప్రోచ్ పేపర్‌ను ఈ సందర్భంగా అధికారులు సీఎం అందజేశారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073